

ఖాద్రీశుడి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

ఆలయాల మూత

కదిరి/లేపాక్షి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ ఆదివారం మూతపడ్డాయి. కదిరిలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి, లేపాక్షి వీరభద్రస్వామి తదితర ప్రధాన ఆలయాల తలుపులను మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయాల తలుపులు తెరుచుకోనున్నాయి. ఆలయ శుద్ధి, పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆయా ఆలయాల అధికారులు, అర్చకులు తెలిపారు.

ఆకాశంలో కనువిందు చేస్తున్న హరివిల్లు



వర్ణశోభితం

చిరుజల్లులు పడుతున్నాయి. అదే సమయంలో సూర్యుడి కాంతి కిరణాలు ప్రసరిస్తున్నాయి. ఈ తరుణంలో ఆకాశంలో హరివిల్లు (ఇంద్రధనుస్సు) కనువిందు చేసింది. ఓబుళదేవరచెరువులో ఆదివారం సాయంత్రం హరివిల్లు కనువిందు చేసింది.

-ఓబుళదేవరచెరువు (ఆంధ్రజ్యోతి)

సూపర్‌సిక్స్ సభను విజయవంతం చేద్దాం

మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సూపర్‌సిక్స్ హామీలు సూపర్‌హిట్ అయిన సందర్భంగా అనంతపురంలో ఈనెల 10న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేద్దామని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సభకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితర ముఖ్య నేతలు హాజరవుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాయిస్థలం.. హృదయస్థలం



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కాంచీపురం జిల్లాకి చెందిన బాలవికాస్ చిన్నారులు సాయిస్థలం.. హృదయ స్థలం.. పేరిట ప్రదర్శించిన నృత్య రూపకం భక్తులను మైమరపింపజేసింది. కాంచీపురం జిల్లా భక్తులు పర్తియాత్ర పేరిట ఆదివారం స్థానిక ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సాయికుల్వంత్ సభామండపంలో శతవర్షప్రేమజ్యోతి పేరిట సంగీత గాన కచేరి నిర్వహించారు. అనంతరం కాంచీపురం బాలవికాస్ విద్యార్థులు నృత్యం ప్రదర్శించారు. గంటపాటు భక్తులను మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నాటకం ప్రదర్శిస్తున్న చిన్నారులు

వదలని జ్వరం

- గ్రామాల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు
- వేధిస్తున్న దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు
- ప్రైవేటు ఆస్పత్రులకు జనం క్యూ
- లోపించిన పారిశుధ్యం
- బెంబేలెత్తిస్తున్న దోమలు



ఓడీసీ బీసీ కాలనీలో రోడ్డు పైనే ప్రవహిస్తున్న మురుగునీరు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): విష జ్వరాలతో గ్రామీణ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏ ఇంట్లో చూసినా దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడేవారే కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. మండలంలోని బొడెద్దులవారిపల్లి, రామిరెడ్డిపల్లి, ఓడీసీ బీసీకాలనీ తదితర ప్రాంతాల్లో వైరల్ ఫీవర్ బాధితులు ఎక్కువగా ఉన్నారు. ప్రధానంగా చిన్నారులకు జ్వరాలు వస్తుండటంతో వైద్యం కోసం తల్లిదండ్రులు కదిరి, ఓడీసీ తదితర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు.

నామమాత్రంగా ప్రభుత్వ వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య స్థితిగతులు పరిశీలించాల్సిన ప్రభుత్వ వైద్య సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జ్వరపీడిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, ఫాగింగ్ చేస్తున్నామని వైద్య శాఖ అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అస్సలు అమలు కావడం లేదు.

పెరుగుతున్న జ్వర పీడితులు

విష జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్తోమత ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. లేని వారు ఏవో మందు బిళ్లలు మింగుతూ ఇంటి వద్దే మూలుగుతూ ఉన్నారు. బొండెద్దులవారిపల్లిలో బంకముత్తక వెంకటలక్ష్మమ్మ (మిగతా 7లో..)

ఫసల్ బీమాయ

- మెసేజ్ వచ్చింది.. లెక్క రాలేదు!
- రూ.వేలల్లో మంజూరైనట్లు మెసేజ్‌లు..
- రూ.వందల్లో జమ
- గతనెల 11న జిల్లాకు రూ.77.49 కోట్లు విడుదల
- ఇప్పటిదాకా రైతుల ఖాతాలకు జమకాని వైనం
- ఆందోళనలో అన్నదాతలు



అనంతపురం అర్బన్/యాడికి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా సొమ్ము జమలో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. జిల్లాలోని పలువురు రైతులకు రూ.వేలల్లో ఫసల్ బీమా సొమ్ము మంజూరైనట్లు సెల్ ఫోన్లకు సంక్షిప్త సమాచారం ఇచ్చారు. వందల్లో బీమా డబ్బులు జమ కావడంతో రైతులు అవాక్కవుతున్నారు. ఫసల్ బీమాకు అర్హులైన రైతుల్లో ఎక్కువ మంది రైతులకు ఇప్పటి దాకా ఎలాంటి సొమ్ము జమ కాకపోవడం గమనార్హం. ఫసల్ బీమా యోజన టోల్ ఫ్రీ నంబర్ 14447కు కొందరు రైతులు ఫోన్ చేసినా... వారి నుంచి సరైన సమాధానం లేదు. పది రోజులకు మళ్లీ ఫోన్ చేయాలంటూ ఉచిత సలహా ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో స్థానిక వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి అడిగినా.. ఫసల్ బీమాను ఎప్పుడు జమ చేస్తారో చెప్పలేకపోతుండటంతో ఏం చేయాలో తోచని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

మెసేజ్‌ల మాయ..!

జిల్లాలో పలువురు రైతులకు రూ.వేలల్లో ఫసల్ బీమా మంజూరైనట్లు సెల్ ఫోన్లకు సమాచారం పంపారు. అయితే బ్యాంక్‌లోకి వెళ్లి ఆరా తీస్తే వందల్లోనే బీమా సొమ్ము జమైనట్లు చెబుతుండటంతో అవాక్కవుతున్నారు. ఉదాహరణకు.. రాయదుర్గం మండలం ఆర్‌బీ వంకకు చెందిన (మిగతా 7లో...)

రౌడీషీటర్లపై నిఘా..!

- డీజీపీ ఆదేశాలతో ఖాకీల అలర్ట్
- స్టేషన్ల వారీగా వివరాల సేకరణ
- వారి వ్యవహారాలపై ఆరా



హిందూపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న దారుణ హత్యల్లో పాత నేరస్తులైన రౌడీ షీటర్ల పాత్ర ఉంటోంది. కొన్నిచోట్ల రౌడీషీటర్లే దారుణ హత్యకు గురవుతున్నారు. మరికొన్నిచోట్ల అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ఈ తరుణంలో ఏ-గ్రేడ్, బీ గ్రేడ్ రౌడీషీటర్లపై పోలీసులు నిఘా ఎంతమాత్రం ఉంచారన్న దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రౌడీషీటర్లు ఏం చేస్తున్నారనేదానిపై ఖాకీ దృష్టి సారించింది. వారిపై నిఘా ఉంచాలని డీజీపీ ఆదేశాలు ఇవ్వడంతో పోలీసులు ఆ పనిలో పడ్డారు.

వివరాల సేకరణ

పోలీసు స్టేషన్ల వారీగా రౌడీషీటర్లు ఎంతమంది ఉన్నారు, ఇంకా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారా, రాజకీయ నాయకులతో అంటకాగుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారా? అన్న వాటిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. నెల్లూరు శ్రీకాంత్ సెటిల్‌మెంట్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. అతడు జైలులోనే ఉంటూ తతంగం నడపడంతో రాష్ట్ర వ్యాప్తంగా షీటర్లపై పోలీసులు నిఘా పెంచారు. నాలుగు రోజుల క్రితం ధర్మవరంలో ఓ రౌడీషీటర్‌ను దారుణంగా కత్తులతో నరికి చంపారు. దీంతో పోలీసులు స్టేషన్లవారీగా వివరాలను వెనువెంటనే తెప్పించుకున్నారు. ఆ మేరకు వారిపై ఉక్కుపాదం మోపేలా చర్యలు చేపడుతున్నారు. మళ్లీ నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లపై చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు ఇవ్వడంతో స్థానిక పోలీసులు స్పందించారు. దీంతో సబ్‌డివిజన్లు, స్టేషన్లవారీగా ఎంతమంది యాక్టివ్‌గా ఉన్నారు, వీరంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు, రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెలుగుతున్నారా.. అన్న అంశాలపై విచారణ చేస్తున్నారు. గతేడాది రౌడీషీటర్లు ఎక్కడైనా మళ్లీ హత్యలు, హత్యాయత్నాలు, ఇతర గ్రేవ్ కేసుల్లో పాల్గొన్నారా అనేది పరిశీలిస్తున్నారు. పాత రికార్డులు తిరగేస్తున్నారు. రౌడీషీటర్లుగా నమోదైన జాబితా బయటకు తీస్తున్నారు. గతంలో ప్రతి వారం రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించుకుని, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేవారు. స్టేషన్ పరిధిలోని టాప్ టెన్‌లో ఉన్న షీటర్లను గుర్తించి పాత కేసుల్లో పాత్ర ఉన్నవారిని వారం వారం పరిశీలించేవారు. వైసీపీ హయాంలో కొంతమంది నాయకులపై షీట్ ఓపెన్ చేశారు. అటువంటి వారిని రాజకీయంగా చేశారా.. నేరాలు చేసి ఉంటే వారిపై షీట్ ఓపెన్ చేశారా అని పరిశీలిస్తున్నారు.

పురం సబ్ డివిజన్‌లో 313 మంది రౌడీ షీటర్లు

హిందూపురం సబ్ డివిజన్‌లో 313 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వన్‌టౌన్ పరిధిలో 47 మంది, టూటౌన్ పరిధిలో 85 మంది, అప్‌గ్రేడ్ స్టేషన్‌లో 66మంది, లేపాక్షి 44 మంది, చిలమత్తూరు 24మంది రౌడీషీటర్లు ఉన్నారు.

ఖాకీ అలర్ట్

ఇటీవల ధర్మవరంతోపాటు మరికొన్నిచోట్ల రౌడీషీటర్లు దారుణ హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించడంతో స్థానిక పోలీసులు అలర్ట్ అయ్యారు. సబ్ డివిజన్‌లో ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారు, ఎప్పటి నుంచి ఉన్నారు, వారిపై ఎందుకు షీట్ ఓపెన్ చేశారు, ఓపెన్ అయ్యాక ఏవైనా నేరాలకు పాల్పడ్డారా, అవి ఎలాంటివి అని పోలీసులు విచారణ చేస్తున్నారు. అయినా రౌడీషీటర్లు కొన్నిచోట్ల మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారు.

నిఘా ఉంచాం:

మహేష్, డీఎస్పీ, హిందూపురం

సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై నిఘా ఉంచాం. ఏ కేటగిరి షీటర్లు ఎక్కడున్నారు, వారి నడవడిక, ఎక్కడెక్కడికి వెళ్లి వస్తున్నారు అనే దానిపై నిఘా పెట్టాం. వారు నివాసాలున్న ప్రాంతాల్లో నిత్యం పోలీసులు గస్తీ తిరుగుతున్నారు.

నేడు పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు రెడ్ రన్

కొత్తచెరువు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని డిగ్రీ విద్యార్థులకు ఈనెల 9వ తేదీన హిందూపురంలో రెడ్ రన్ పేరిట 5కే మారథాన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఐవీ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెడ్ రన్ నిర్వహిస్తున్నామన్నారు. హాజరయ్యే విద్యార్థుల వయసు 17 నుంచి 25 సంవత్సరాలు ఉండాలన్నారు. జిల్లాలో ఏదైనా కాలేజీలో డిగ్రీ చదువుతుండాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 9వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు హిందూపురంలోని మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడ పేర్లు నమోదు చేసుకుంటారన్నారు. అనంతరం రన్ ఉంటుందన్నారు. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతి కింద రూ.7వేల నగదు అందజేస్తామని ఆయన వివరించారు.



పనులను పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు



రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న నాయకులు

సీఎం టూర్‌పై సమీక్ష

మ్యాపుల ఆధారంగా పరిశీలించిన నాయకులు 7

చురుగ్గా ఏర్పాట్లు



సూపర్‌సిక్స్.. సూపర్‌హిట్ సభకు సిద్ధమవుతున్న వేదిక

- సూపర్ సిక్స్‌కు భారీ సన్నద్ధత...!
- జీఎంఆర్ ఇంద్రప్రస్థలో ఏర్పాట్లు
- సభకు 3.5 లక్షల మంది వస్తారని అంచనా
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

అనంతపురం క్రైం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత తొలిసారి రాష్ట్రస్థాయి కార్యక్రమానికి అనంతపురం నగరం వేదిక కాబోతోంది. సూపర్ సిక్స్- సూపర్‌హిట్ పేరుతో జిల్లా కేంద్రంలో ఈనెల 10న ప్రభుత్వం భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ అతిరథ మహారథులు ఈ కార్యక్రమానికి తరలిరానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ పెద్దలు (మిగతా 7లో...)

పాడికి చేయూత

- పశుసంపద వృద్ధికి ప్రభుత్వం చర్యలు
- ఉచితంగా మేలు జాతి పశువుల వీర్యం
- సిబ్బంది కొరతతో లక్ష్యానికి గండి



పుట్టపర్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోంటోంది. జిల్లాలో పశు సంపద వృద్ధికి అన్నీ పెయ్య దూడలు పుట్టేలా మేలు జాతి వీర్యం ఎద సూదులు పంపిణీ చేస్తోంది. మేలు జాతి పశువుల వీర్యం సేకరించి రైతులకు అతి తక్కువ ధరకు అందించేందుకు కృషి చేస్తోంది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో తక్కువ ధరకు పంపిణీ చేస్తున్నా జిల్లాలో మాత్రం ఉచితంగా పాడిరైతులకు అందిస్తోంది.

మేలు జాతి పశువుల వీర్యం

పశువుల్లో ఒక సూదికే చూడి కట్టేవి, రెండు సూదులకు కట్టేవి ఉంటాయి. గతంలో ఒక సూది పూర్తి ధర రూ.1350 ఉండగా.. అందులో రూ.850 రాయితీ ఇచ్చి మిగిలిన రూ.500 రైతు ద్వారా వసూలు చేసి పశువులకు ఎద సూదులు వేసేవారు. ఒక సూదికైనా రెండు సూదులకైనా ఇదే మొత్తాన్ని ఇప్పటి వరకు వసూలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పలు జిల్లాల్లో మేలు జాతి వీర్యం ఎద సూదులకు రూ.150 వసూలు చేస్తుండగా శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం ఉచితంగానే అందిస్తోంది. ఎద సూదులు వేస్తే సుమారు 90శాతం పెయ్య దూడలు పుడతాయని పశుసంవర్ధక శాఖ అధికారులు అంటున్నారు. ఆవుల్లో ఎద సూదులు హెచ్‌ఎఫ్ జెర్సీ, గిర్ సాహీవాల్, గేదేల్లో ముర్రా జాతి రకం వీర్యాన్ని జిల్లాకు పంపించారు. జిల్లాలో 6వేల తెల్లనల్ల పశువులకు ఎద సూదులు వేయాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు. జిల్లాలో తెల్ల, నల్ల జాతి రకాల పశువుల 3.76 లక్షలు ఉన్నాయి. ఇప్పటిదాకా జిల్లాలో 1200 దాకా సూదులు వేసినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. తమ పశువులకు ఎద సూదులు వేయించడానికి రైతులు ముందుకు వస్తున్నా పశువైద్యశాలలో సిబ్బంది కొరతతో లక్ష్యాన్ని అధిగమించలేకపోతున్నారన్న విమర్శలున్నాయి.

ఉచితంగా ఎద సూదులు

జిల్లాలో పాడి రైతుల ఆదాయం పెరిగేలా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మేలు జాతి పశువుల వీర్యం ఎద సూదులను జిల్లాలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. క్షేత్రస్థాయిలో మా సిబ్బంది దగ్గర ఎద సూదులు అంటుబాటులో ఉన్నాయి. జిల్లా లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో పాడి రైతులు మేలు జాతి ఎదసూదులు వేయించి పెయ్య దూడల సంఖ్య పెంచేందుకు దోహదపడాలి.

-శుభదాస్, పశు సంవర్ధక శాఖ, జిల్లా అధికారి

చురుగ్గా ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

అనంతపురం చేరనున్నారు. దీంతో సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభ నిర్వహించే నగరంలోని జీఎంఆర్ గ్రౌండ్స్‌లో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బహిరంగ సభా వేదికతోపాటు, గ్యాలరీలు, హెలీప్యాడ్స్, పార్కింగ్ ప్రాంతాల్లో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

భారీ బహిరంగ సభావేదిక

శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభా వేదికను సిద్ధం చేస్తున్నారు. సుమారు ఏడు అడుగుల ఎత్తులో సభావేదికను సిద్ధం చేస్తున్నారు. వంద మందికి పైగా పట్టే స్థాయిలో సభావేదికను రూపొందిస్తున్నారు. బహిరంగ సభా వేదిక అవసరాల కోసం విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు సైతం తరలిస్తున్నారు. ఈ పనులన్నీ దాదాపుగా కొలిక్కివచ్చాయి. వేదికకు ముందుభాగంగా 3.5లక్షల మంది ఆశీనులు కావడానికి అరకిలోమీరుకు పైగా భారీగా గ్యాలరీలు ఏర్పాటుచేశారు. వేదికకు ఇరువైపులా వీవీఐపీలు, వీఐపీలు, మీడియా గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. వేదిక వెనుక వైపు సైతం పెద్ద పెద్ద స్థాయిలో టెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. జాతీయ రహదారిలో చైతన్య స్కూల్ సమీపంలో రెండు హెలీప్యాడ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. చాపర్లు దిగేందుకు వీలుగా కాంక్రీట్ బేస్‌మెంట్‌తో స్ట్రాంగ్‌గా హెలీప్యాడ్స్ సిద్ధం చేస్తున్నారు.

వాహనాల కోసం పార్కింగ్ ఏరియాలు

బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీగా హాజరుకానున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల పెద్దలతోపాటు, ఇతర నాయకులు కూడా హాజరుకానున్నారు. ప్రజలు 3.5 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో వీరందరి సౌకర్యార్థం భారీగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. నీరు- ప్రగతి పార్కు ఎదురుగా, చుట్టు పక్కల ఉన్న స్థలాన్ని శుభ్రం చేశారు. శ్రీనగర్ కాలనీలోని 80 నుంచి 95 శాతం ఓపెన్ స్థలాలన్నీ శుభ్రం చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లు పెట్టి ముళ్ల పొదలు, మట్టిదిబ్బలు శుభ్రం చేయించారు. మారుతీనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ అనుకుని ఉన్న ప్రాంతం, ఆ రైల్వే గేట్‌కు ఆనుకుని ఉన్న రోడ్డు వెంబడి ఉన్న ఓపెన్ స్థలాలను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. వేలాది వాహనాలు పార్కింగ్‌కు అనువుగా ఎక్కడ ఏ చిన్న ఖాళీ స్థలం కనిపించినా శుభ్రం చేయిస్తున్నారు. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఓపెన్ స్థలాలను శుభ్రం చేయిస్తున్నారు.

వదలని జ్వరం


జర్వంతో బాధపడుతున్న వెంకటలక్ష్మమ్మ

(5వ పేజీ తరువాయి)

నాలుగురోజులుగా జ్వరంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటోంది. ఇదే గ్రామంలో బి. మున్నా, బి. ప్రసన్న, పునిత్, లక్ష్మీపతినాయుడు, గంగులప్ప కుమారైలు మలేశ్వరీ, శ్రీదేవి, రామిరెడ్డిపల్లిలో వైభవి, వైదీష్, మహమ్మదాబాద్ క్రాస్‌లో ప్రణీత్యా, ఆమె తల్లి శైలజ, తిప్పేపల్లిలో స్నేహ, నాగేంద్ర, ఓడీసీ బీసీ కాలనీలో హర్షియా, మినహా, ముంతాజ్, శివారెడ్డి, ఇలా చాలమంది జ్వరాల బారిన పడ్డారు.

లోపించిన పరిశుభ్రత

మండలకేంద్రంలోని బీసీ కాలనీలో పరిశుభ్రత లోపించింది. కాలనీలో మురుగునీటి కాలువలు లేకపోవడంతో వీధుల్లోనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది, పగలు రాత్రి తేడా లేకుండా కడుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీటి కాలువ లు ఏర్పాటుచేయాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదన్నారు. పాలకులు మారుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పంచాయతీ అధికారులు కూడా ఫాగింగ్ చేయడం లేదని వారు పేర్కొన్నారు.

వైద్యసేవలు అంతంతే..



గత కొన్నిరోజులుగా నేను, నా కుమారై జ్వరంతో బాధపడుతున్నాం. స్థానికంగా ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రారంభంలో గొంతు, వొళ్ల నొప్పులతోమొదలై జ్వరం వస్తోంది. అధికారులు స్పందించి మెరుగైన వైద్యసేవలందించాలి.

- ఎన్.శైలజ, మహమ్మదాబాద్ క్రాస్

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి



జ్వరాలు తగ్గేవరకు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా నొప్పులు, జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నిరోజులుగా నాకు మారైలు జ్వరంతో బాధపడుతున్నారు. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో ఓడీసీకి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది.

-వల్లపు గంగులప్ప, బొండెద్దులవారిపల్లి

శిబిరాలు ఏర్పాటుచేస్తాం

జ్వరపీడిత గ్రామాలను గుర్తించి ఆప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. సిబ్బందికి సూచనలిచ్చి, సకాలంలో వైద్యం అందేలా చర్యలు చేపడతాం.

-డాక్టర్ భానుప్రకాష్‌నాయక్, వైద్యాధికారి

మహానాడుకు మించి సక్సెస్ చేస్తాం

14 నెలల్లోనే కీలక హామీల అమలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

సభాస్థలి, ఏర్పాట్ల పరిశీలన


హెలీప్యాడ్ వద్ద బందోబస్తు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభను కడపలో జరిగిన మహానాడుకు మించి విజయవంతం చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకు వచ్చిన ఆయన సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి సభాప్రాంగణాన్ని, సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించారు. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే కీలకమైన హామీలు నెరవేర్చామన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక కార్యక్రమాలతో రాష్ట్రంలో మహిళలు చాలా ఆనందంగా ఉన్నారని తెలిపారు. సూపర్‌సిక్స్ హామీల అమలు గురించి చెప్పడానికే బహిరంగ సభ అని ఆయన పేర్కొన్నారు. సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఇతర ప్రముఖులు వస్తారని తెలిపారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర్ రావు మాట్లాడుతూ 11 సీట్లు ఇచ్చినా ప్రజల పక్షాన మాట్లాడలేని అసమర్థ నాయకుడు జగన్ అంటూ మండిపడ్డారు. లిక్కర్ స్కాంలో వైసీపీ నేతలంతా జైలు బాటలో ఉన్నారన్నారు. జగన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే..అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అంజన్న, ఏపీఐఐసీ చైర్మన్ రాజు, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, దేవానంద, టీడీపీ ఇతర నాయకులు ఆలం నరసానాయుడు, రామలింగారెడ్డి, దేవళ్ల మురళి, బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, జేఎల్ మురళి, రాయల్‌మురళి, మదమంచి స్వరూప, సింగవరం రవి, తేజస్విని, హరి, నెట్టం బాలకృష్ణ, రాజారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీఎం టూర్‌పై సమీక్ష

- మ్యాపుల ఆధారంగా పరిశీలించిన నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్ సమీక్షించారు. ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో 10న జరిగే సీఎం బహిరంగ సభపై ఆదివారం చర్చించారు. మ్యాప్‌ల ఆధారంగా బహిరంగసభ, పార్కింగ్ ఏరియాలు, హెలీప్యాడ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు,ఎంఎస్‌రాజు, బండారు శ్రావణిశ్రీ , ఏపీఐఐసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి : కలెక్టర్

సీఎం పర్యటన నేపథ్యంలో 15 చోట్ల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. శ్రీనగర్ కాలనీ పక్కన విజేత సూపర్ మార్ట్ పక్కన, కేశవరెడ్డి స్కూల్ సమీపంలో, సంఘమిత్ర నగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, వీవీఐపీ, వీజీపీ పార్కింగ్ తదితర 15 ప్రాంతాల్లో చేస్తున్న పార్కింగ్ ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థలాలు శుభ్రం చేయడం, రోలింగ్ చేయడం, పోల్స్ తొలగించడం, లెవలింగ్, ఎంట్రీ, ఎగ్జిట్స్ పనులు, మార్కింగ్ చేయడం వంటి పనులు వేగంగా పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, కమిషనర్ బాలస్వామి, ఈఈ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

ధర్మవరంరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి క్రాస్ 44వ జాతీయరహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లి మండలం కోటంపల్లి గ్రామానికి చెందిన కోలు వంశీ (22) అనంతపురంలో ప్లంబర్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఉదయం మాలపౌర్ణమి పండగకు సొంతూరికి తన స్కూటీపై బయల్దేరాడు. మార్గమధ్యంలో సీతారంపల్లి క్రాస్ సమీపంలో స్కూటీ అదుపుతప్పి పక్కనున్న డివైడర్లను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వంశీని స్థానికులు 108 ద్వారా అనంతపురం తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నందిని ఉన్నారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు

యాడికి, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): డబ్బులు బాకీ ఉన్నారని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న సయ్యద్ గౌస్‌బాషాపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు కడపజిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా రాయలచెరువుకు చెందిన పెయింట్‌షాపులో తనకు డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు తెలిపారు. డబ్బులు ఇవ్వని యజమాని రాజేష్‌ను చంపుతానని బెదిరించినట్లు సయ్యద్ గౌస్ బాషాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సయ్యద్ గౌస్‌బాషా పలు దుకాణాల్లో ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. గుత్తిలోని ఒక ఎరువుల అంగడిలో, రాయలచెరువులోని ఒక గుజిరీ దుకాణంలో డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కొక్కటిగా వెలుగులోకి ..

కళ్యాణదుర్గంలోని ఒక ఫర్టిలైజర్ దుకాణంలో సయ్యద్‌గౌస్‌బాషా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి డబ్బులు వసూలుచేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గుత్తిలోని ఒక ఎరువుల అంగడిలో ఇదేవిధమైన బెదిరింపులకు పాల్పడినట్లు, వారు కూడా పోలీసులకు ఫిర్యాదుచేయడానికి యాడికి పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. రాయలచెరువులోని గుజిరి దుకాణంలో మహిళను డబ్బులు ఇవ్వాలని సయ్యద్ గౌస్‌బాషా బెదిరించినట్లు తెలిసింది. కడప జిల్లా సింహాద్రిపురంలో ఒక పెయింట్‌షాపు యజమానిని బెదిరించిన సీసీ ఫుటేజీ వీడియోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన గోసుల భార్గవ (25) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు రాజేంద్రనగర్‌కు చెందిన లేట్ సాంబశివుడు కుమారుడు గోసుల భార్గవ మొబైల్ షాపులో పనిచేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఐదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో శస్త్రచికిత్సలు చేయించుకున్నాడు. కాలికి రాడ్లు వేయడం వల్ల దివ్యాంగుడిగా తాను ఏ పనిచేయలేకపోతున్నానని తరచూ మనోవేదన చెందేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంటిపై మేడలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం ఎంత సేపటికి లేవకపోవడంతో కుటుంబసభ్యులు మేడపైకి వెళ్లారు. ఉరికి వేలాడుతున్న భార్గవను చూసి బోరున విలపించారు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు అవివాహితుడు కాగా, తల్లితోపాటు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు.

వినాయక విగ్రహం తగులుకుని

వంకలో మునిగిన యువకుడు


గిరీష్ (ఫైల్)

రాప్తాడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): వంకలో ఈత కొడుతున్న యువకుడి ప్యాంటుకు ఇటీవల నిమజ్జనం చేసిన వినాయక విగ్రహం తగులుకుని, నీట మునిగి మరణించాడు. మండల కేంద్రానికి చెందిన తలారి నరసింహులు మూడో కుమారుడు తలారి గిరీష్ (23) ఇంటర్ పూర్తి చేశాడు. అయ్యవారిపల్లి రోడ్డులోని వంక మేరు వంక వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. మిత్రులు ఇళ్లకు వెళ్లిపోయారు. గిరీష్ వంకలో ఈత కొట్టేందుకు దిగాడు. ఇటీవల నిమజ్జనం చేసిన వినాయకుడి విగ్రహం ప్యాంటుకు తగులుకోవడంతో నీట మునిగి మృతిచెందాడు. గిరీష్ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. వంక వద్ద గిరీష్ టీషర్ట్ కనిపించడంతో నీటిలో వెతకగా మృతదేహం లభించింది. గిరీష్‌కు వివాహం కాలేదు. అతడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఫసల్ బీమాయ

(5వ పేజీ తరువాయి)

నరేంద్రనాయక్‌కు 8.25 ఎకరాల కందికి రూ.25వేలు ఫసల్ బీమా మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. ఆ రైతు ఖాతాకు రూ.800 మాత్రమే జమైంది. అదే గ్రామానికి చెందిన మహిళా రైతు నిర్మలాబాయికి 5 ఎకరాల కంది పంటకు రూ.15 వేలు మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. అయితే కేవలం రూ.400 జమైంది. ఈ రకంగా జిల్లాలోని పలువురు రైతులకు అతి తక్కువగా బీమా డబ్బులు జమ చేశారు. దీంతో మిగిలిన డబ్బులు ఎప్పుడు జమ చేస్తారో చెప్పేవారు లేక ఆ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికీ ఖాతాలకు జమ కాని సొమ్ము..

ఈ ఏడాది ఆగస్టు 11న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాజస్థాన్‌లోని జుంజును నుంచి దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా సొమ్మును విడుదల చేశారు. 2023 ఖరీఫ్, రబీ, 2024 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి ఫసల్ బీమా ద్వారా జిల్లాకు రూ.77.49 కోట్లను విడుదల చేశారు. ఇందులో భాగంగా... 2023 ఖరీఫ్‌లో కంది రైతులకు రూ.1,59,73,932లు, 2023 ఖరీఫ్‌లో ఎండు మిరప రైతుకు రూ.1,33,72,251, 2023 ఖరీఫ్‌లో జొన్న రైతులకు రూ.45,70,041లు విడుదలైంది. 2023 ఖరీఫ్‌లో మూడు పంటలకు మొత్తం రూ.3,39,16,224లు విడుదలైంది. 2023 రబీ సీజన్‌లో పప్పుశనగ రైతులకు రూ.14,97,59,866, వేరుశనగ రైతులకు రూ.29,19,301లు విడుదలైంది. 2023 రబీలో రెండు పంటలకు మొత్తం రూ.15,26,79,168లు విడుదల చేశారు. 2024 ఖరీఫ్‌లో కంది రైతులకు రూ.56,55,43,578, 2024 ఖరీఫ్‌లో జొన్న రైతులకు రూ.2,28,41,233లు విడుదలైంది. 2024 ఖరీఫ్‌లో రెండు పంటలకు మొత్తం రూ.58,83,84,811లు విడుదల చేశారు. దీంతో తమకు ఫసల్ బీమా సొమ్ము జమఅవుతుందని రైతులు ఆశపడ్డారు. అయితే ఇప్పటి దాకా రైతులకు జమ కాలేదు. జిల్లాలోని అనేక మంది రైతుల ఫోన్లకు 2024 ఫసల్ బీమా కింద జమ అయ్యే డబ్బుల వివరాలతో సంక్షిప్త సమాచారం మాత్రమే పంపారు. అందులో మీ ఆధార్ బ్యాంక్ ఖాతా నెంబర్‌తో లింక్ కాకపోవడంతో ఫసల్ బీమా సొమ్ముజమ కాలేదంటూ సమాచారం వచ్చింది. మరికొందరికి ఫసల్ బీమా సొమ్ము మంజూరైనట్లు సమాచారం పంపారు. అయితే ఇప్పటి దాకా ఖాతాలకు బీమా డబ్బులు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ.20,300 మంజూరైనా.. రూ.287 జమైంది..



ఫసల్ బీమా కింద 2.75 ఎకరాల కంది పంటకు రూ.20300లు మంజూరైనట్లు సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అయితే రూ.287లు మాత్రమే బ్యాంక్ ఖాతాకు జమైంది. ఫసల్ బీమా హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 14447కు ఒక సారి ఫోన్ చేసి, తక్కువ డబ్బులు జమైన విషయం చెప్పాగా.. పది రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేయాలని చెప్పారు. రెండో సారి ఫోన్ చేయగా.. ఎప్పటిలోగా మిగతా డబ్బులు పడతాయో సరైన సమాధానం చెప్పలేదు. సెల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా డబ్బులు జమ చేయలేదు. మిగిలిన డబ్బులు జమ చేస్తారో..? లేదో అర్థం కావడం లేదు.

- రైతు తిప్పారెడ్డి, అయ్యవారిపల్లి, గుంతకల్లు మండలం

డబ్బులు జమ కాలేదు



గత ఏడాది మూడు ఎకరాల్లో కంది పంట సాగు చేసి నష్టపోయా. ఫసల్ బీమా కింద రూ.32వేలు మంజూరైనట్లు 20 రోజుల కిందటే సెల్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. ఇప్పటి దాకా బ్యాంక్ ఖాతాలో ఒక్క పైసా జమ కాలేదు. ఇప్పటికే పలు సార్లు బ్యాంక్‌కు వెళ్లి అడిగినా ఇంకా డబ్బులు జమ కాలేదని చెబుతున్నారు. బీమా డబ్బులు ఎప్పుడు జమ అవుతాయో ఎవరూ సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి బీమా డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలి.

-రైతు హనుమంతునాయుడు, యాడికి

మధ్యప్రదేశ్ హ్యాట్రిక్ విజయం


వీరారెడ్డి


యశ్‌వర్ధన్ సింగ్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ జట్టు హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో మధ్యప్రదేశ్, బరోడా జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మధ్యప్రదేశ్ జట్టు 48.1ఓవర్లలో 218పరుగులకు ఆలౌట్ అయ్యింది. యశ్‌వర్ధన్‌సింగ్ 106, శౌర్య 58 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన బరోడా జట్టు 38.1ఓవర్ల లో 130పరుగులకు ఆలౌట్ అయ్యింది. సమిత్‌రత్న 58పరుగులు, ప్రియాన్ష్ జాదవ్ 47 చేశాడు. మధ్యప్రదేశ్ బౌలర్లు యువరాజ్ 4, గిరిరాజు శర్మ 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ప్రెసిడెంట్ లెవెన్, సెక్రెటరీ లెవన్ జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ సెక్రటరీ జట్టు 48.5ఓవర్లలో 167పరుగులకు ఆలౌట్ అయ్యింది. ప్రెసిడెంట్ బౌలర్ శాహల్ హమీద్ 5వికెట్లు పడగొట్టాడు. అనంతరం బరిలోకి దిగిన ప్రెసిడెంట్ జట్టు 27.1ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి 40బంతుల్లోనే 13బౌండరీలు, 8సిక్సర్లతో (107) శతకాన్ని బాది జట్టుకు 7వికెట్ల విజయాన్ని అందించాడు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

మౌనగిరి క్షేత్రాన్ని సందర్శించిన

కర్ణాటక హైకోర్టు జడ్జి


దక్షిణామూర్తి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జస్టిస్ దేవదాస్

రాప్తాడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం గ్రామ సమీపానగల మౌనగిరి హనుమాన్ క్షేత్రాన్ని కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ దేవదాస్ ఆదివారం సందర్శించారు. మౌనగిరి క్షేత్రంలో దక్షిణామూర్తి దేవాలయ భూమిపూజ కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. 39 అడుగుల ఏక శిలా హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మౌనగిరి వ్యవస్థాపకుడు ఈశ్వరయ్య.. కర్ణాటక హైకోర్టు జడ్జిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా అదనపు జడ్జి సత్యవాణి పాల్గొన్నారు.

ఉత్తమంగా బోధించండి

- సినీ నటుడు నాగినీడు


మాట్లాడుతున్న సినీనటుడు నాగినీడు

ధర్మవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలుగు సినిమా నటుడు నాగినీడు అన్నారు. స్థానిక ఎన్జీఓహోంలో ఆదివారం ఆత్మీయట్రస్టు, యూటీఎఫ్ ధర్మవరంశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ ట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగినీడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో కనెక్ట్ కాకపోతే మీరు చెప్పే పాఠాలు వారికి అర్థం కావన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఉపాధ్యాయుడి దగ్గరకు వచ్చేలా విద్యార్థులను మలుచుకోవాల్సిన బాధ్యత మీదేనన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో 68మందిని ఎంపిక చేసి వారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు నాగినీడు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డీవైఈఓ జాన్‌రెడ్డప్ప, ధర్మవరం ఎంఈఓలు రాజేశ్వరదేవి, గోపాల్‌నాయక్, చిలమత్తూరు ఎంఈఓ హనుమంతురెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, జిల్లాకార్యదర్శి రామకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థల వివాదంతో ఆగిన అంత్యక్రియలు


శవపేటిక వద్ద బైఠాయించిన ఎస్సీలు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లిలో శ్మశాన స్థల వివాదంతో వ్యక్తి అంత్యక్రియలు నిలిచిపోయాయి. గ్రామంలో దళితులు మృతిచెందిన ప్రతిసారీ అంతక్రియలకు అడ్డంకులు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా దళితుడు నారాయణప్ప(77) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. అంతక్రియల ఏర్పాట్ల కోసం కుటుంబ సభ్యులు వెళ్లగా అదే గ్రామానికి చెందిన శంకరనారాయణ వర్గీయులు అడ్డు చెప్పారు. ప్రస్తుతం ఈ స్థల వివాదం కోర్టులో ఉందనీ, ఇక్కడ ఖననం చేయడానికి వీలులేదన్నారు. దీంతో దళితులు.. సమస్యను రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో గ్రామానికి చేరుకుని, చర్చించారు. శ్మశాన స్థలం సమస్య కోర్టులో నడుస్తున్నందున ప్రత్యామ్నాయ స్థలంలో అంతక్రియలు నిర్వహించుకోవాలని అధికారులు సూచించగా.. దళితులు ససేమిరా అన్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కాదని మరోచోట ఎలా అంతక్రియలు చేస్తామని ప్రశ్నించారు. దీంతో సమస్యను తహసీల్దార్, ఎస్ఐ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం ఆర్డీఓ మహేశ్ రాత్రి బసంపల్లికి చేరుకుని, కుటుంబసభ్యులు, దళితులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చివరికి సమస్య కొలిక్కి రాకపోవడంతో అంత్యక్రియలు నిలిచిపోయాయి. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, శవపేటిక వద్ద బైఠాయించి, నిరసన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ.. దళితులు చనిపోయిన ప్రతిసారీ ఎక్కడ పూడ్చుకోవాలో తెలియక శవజాగరణ చేయాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. దళితుల శ్మశాన స్థలాన్ని కబ్జా చేసి, సమాధులను ధ్వంసం చేసి పంటను సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇక్కడ 8 ఏళ్లుగా సమస్య కొనసాగుతున్న అధికారులు పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

న్యూస్ బాక్స్

మఠం వీధిలో విద్యుత్ లైన్ ఏర్పాటు



మఠం వీధిలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైన్

కొత్తచెరువు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ విద్యుత్ ఉద్యోగి అక్రమాలకు పాల్పడుతూ విద్యుత్ పరికరాలు అమ్మేస్తున్నాడు అన్న వార్తాకథనం ఆగస్టు 5న ఆంధ్రజ్యోతిలో వెలుబడిన విషయం విదితమే. ఈ వార్త కథనానికి స్పందించిన ట్రాన్స్‌కో ఉన్నతాధి కారులు మఠం వీధిలో విద్యుత్ స్తంభం, విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ వీధిలో ఎనిమిది నెలలుగా ఉన్న విద్యుత్ సమస్య తీరింది. అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులను కూడా ట్రాన్స్‌కో ఉన్న తాధికారులు సస్పెండ్ చేశారని ఏఈ వెంకటేష్ నాయక్ తెలిపారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించినట్లు ఏఈ తెలిపారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో యువర్స్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరు లయన్స్‌సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రి డాక్టర్ భరత్ ఆధ్వర్యంలో 90మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 48మందిని ఆపరేషన్లుకు ఎంపిక చేశారు. వీరికి బెంగళూరులో కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిబిరం దాతలు రామాంజనేయులు, శివశంకర్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరాం, రమేష్‌బాబు, రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ ఖలీల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

● వీధుల్లో వెళ్లాలంటే భయం భయం


ఓడీసీలో ప్రధాన రహదారిలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పలు వీధుల్లోకి భయం భయంగా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధానంగా చిన్నారులను బజారులోకి పంపాలంటే వారి వెంట మరొకరు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా కదిరి, హిందూపురం ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో కుక్కలు స్వైవిహారం చేస్తూ, దాడులు చేస్తుండడంతో ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురువుతున్నారు. చికెన్ సెంటర్ల వద్ద వ్యర్థ పదార్థాల కోసం కుక్కలు గుంపులు గుంపులగా ఉండడంతో ప్రమా దాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. కుక్కల విచ్చల విడి సంచారాన్న అరికట్టాలని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. మరింత ప్రమాదాలు జరుగక ముందే తగ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ


ఫ్రీజర్ బాక్స్‌ను అందజేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డులో వెలసిన పార్వ లింగేశ్వరస్వామి దేవస్థానానికి మండల కేంద్రానికి చెందిన వెంకట రమణారెడ్డి ఆదివారం ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. తన తల్లి మరణించినప్పుడు ఆమె భౌతిక కాయాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్స్ కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డామని, అలాంటి పరిస్థితి ఎవరికి రాకూడదనే తన తల్లి జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్స్‌ను వితరణ చేసినట్లు తెలిపారు. అలాగే దేవస్థానానికి మండల కేంద్రానికి చెందిన గోవిందు యాంప్లి ఫయర్, కృష్ణం వేణుగోపాల్ స్పీకర్ బాక్స్‌లు వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు సోమల ప్రకాష్, కనుమ ప్రభాకర్, సుదర్శన్ రెడ్డి, వెంకటేష్, ఫణీంద్ర గౌడ్, రాజశేఖర్, వెంకట్ రెడ్డి, జగన్, సూరి, కృష్ణా నాయక్, సూరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

● సంతాపం తెలిపిన ఎమ్మెల్యే కందికుంట


మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

నంబులపూలకుంట, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా నివాసముంటున్న టీడీపీ నాయకుడు వెంకటరమణ ఆదివారం మృతిచె ందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆయన మృతదే హాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే తోపాటు టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ దండే రవిశంకర్, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మాజీ జడ్పీటీసీ అంజనప్పనాయుడు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం

నంబులపూలకుంట, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాన్నగారిపల్లికి చెందిన రమేష్‌నాయుడు నెలరో జుల క్రితం మిద్దెపై నుంచి కిందపడి గాయపడ్డారు. తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్సపొంది ఇటీవల ఇంటికి వచ్చారు. మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం రమేష్ నాయుడు ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. మెరుగైన చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు, వేణుగోపాల్, జయ చంద్రారెడ్డి, వేమన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా నీరు వచ్చేనా..?

● కార్యరూపం దాల్చని ఎత్తిపోతల పథకం పనులు

● సన్నగిల్లుతున్న మండల రైతుల ఆశలు


ఎండిపోయిన పోరెడ్డివారిపల్లి చెరువు

గాండ్లపెంట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలానికి హంద్రీనీవా కాలువ నీరు వచ్చేనా? అనే ప్రశ్న రైతుల్లో నెలకొంది. హంద్రీనీవా కాలువ నీరు జిల్లాలు దాటి కుప్పానికి వెళ్తోంది. అయితే గాండ్లపెంట మండలానికి రాకపోవడంతో మండల రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని అత్యంత మెట్ట ప్రాంతం ఉన్న, అత్యల్ప వర్షపాతం నమోదు అయ్యే గాండ్లపెంట మండలానికి కాలువల ద్వారా నీరు వస్తే రైతులు పంటలు సాగుచేసుకుని జీవనం సాగించవచ్చు. హంద్రీనీవా నీరు మండలానికి రప్పిస్తామంటూ ఎన్నికల ముందు నాయకులు హామీలు గుప్పించారేకానీ, కార్యరూపం దాల్చలేదు. మండల వ్యాప్తంగా వందకు పైగా చెరువు లు ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తేనే అవి నిండుతాయి. అరకొర వర్షాలకు చుక్కనీర ఉండదు. మండలంలో ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బోర్లలో నీరు అడుగంటి పోవడంతో పంటలు సాగుచేయలేకపోతున్నారు. ప్రధానంగా ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ సాగుచేస్తారు. అయితే అతివృష్టి, అనావృష్టి కారణంగా పెట్టుబడులు దక్కని పరిస్థితిలో దాదాపు రైతులందరూ ఖరీఫ్‌లో వేరుశనగను వదలేసి, బోర్లకింద మాత్రమే పంటలు సాగుచేస్తున్నారు. అయితే బోర్లు ఎండిపోయి ఎంతోమంది నష్టాలు చవి చూశారు. అలాంటి మండలంపై ఏ నాయకుడూ కరుణ చూపడం లేదని మండల రైతులు విమర్శిస్తున్నారు.

ఇరువైపులా హంద్రీనీవా కాలువలు

మండలానికి ఇరువైపుల హంద్రీనీవా కాలువలు వెళ్తున్నాయి. ఒక వైపు తలుపుల మండలం మీదుగా, మరోవైపు నల్లచెరువు మీదుగా ఉన్నాయి. గాండ్లపెంట మండలం అత్యంత ఎత్తులో ఉండడంతో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు రావాలంటే ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలి. దీనిపై ఎమ్మెల్యే కందికుంట అసెంబ్లీలో చర్చించి, సంబంధిత ప్రణాళికలు ముందుకు సాగేందుకు చొరవ చూపుతున్నారు. మండలానికి సమీపంలోని నల్లచెరువు వద్ద హంద్రీనీవా కాలువ నీరు వెళ్తోంది. గాండ్లపెంటకు ఆ నీరు రావాలంటే సామచేనుబైలు వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి. దాని ద్వారా చెరువులకు నీరు అందించవచ్చు. అలాగే కదిరి రూరల్ మండలానికి నీరు చేరే అవకాశముంది. హంద్రీనీవా ఎత్తిపోతుల పథకానికి రూ.60కోట్లు ఖర్చు అవుతుందని, ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలను తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపారు. అయితే కార్యరూపం దాల్చలేదు. మండలంలో చాలామంది రైతులు ఇప్పటికే ప్రధానంగా ఉద్యాన పంటలపై దృష్టి సారించి, పలు రకాల పండ్ల తోటలు విరివిగా సాగుచేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మండలంలోని చెరువులు ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పలువురి ఉద్యాన పంటల ఎండిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి హంద్రీనీవా నీరు తీసుకురావాలని రైతులు కోరుతున్నారు

బోర్లు అడుగంటి పోతున్నాయి



వర్షాలు సరిగా పడకపోవడంతో మండలంలోని చెరువులన్నీ ఎండిపోయాయి. బోర్లు అడుగంటాయి. మండల ప్రజలు వ్యవసాయంపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. నీరు లేకపోవడంతో రైతులు పంటలు సాగుచేయలేకపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి పలుమార్లు బోర్లు వేసినా, ఒకటి లేదా రెండు పంటలకు మాత్రమే నీరు అందుతోంది. చెరువుల్లో నీరు లేకపోవడం వల్లే బోర్లు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ చూపి, హంద్రీనీవా నీటితో చెరువులు నింపాలి. అప్పుడు భూగర్భజలాలు పెరిగి ఉన్న బోర్లలోనే నీరు వస్తుంది. కొత్తగా బోర్లు వేసుకునే పరిస్థితి తప్పుతుంది. మండలం సస్యశ్యామలం అవుతుంది.

- రాఘవరెడ్డి, రైతు, కటారుపల్లి క్రాస్

నివేదికలు పంపాం

హంద్రీనీవా ఎత్తిపోతల పథకం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారి నుంచి అనుమతులు వస్తే, సామచేనుబైలు నుంచి ఎత్తిపోతల పథకం చేపడతాం. మండలంలోని చెరువులను నీటితో నింపేందుకు అవకాశముంటుంది.

- అరుణకుమారి, జేఈ, ఇరిగేషన్

సూపర్ హిట్ సభను విజయవంతం చేద్దాం

● మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు

● వైసీపీ అసత్య ప్రచారాలకు సమాధానం చెబుదాం: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

ధర్మవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలకు 'సూపర్‌సిక్స్- సూపర్‌హిట్ సభ ద్వారా సమాధానం చెబుతామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, అమలాపురం, కనిగిరి ఎమ్మెల్యేలు ఆనందరావు, ఉగ్రనరసింహ, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ ఎర్రగుంట కార్యాలయంలో ఆదివారం సాయంత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పరిటాలశ్రీరామ్ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు ఆనందరావు, ఉగ్రనరసింహ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నందిరెడ్డి శ్రీని వాసులు హాజరయ్యారు. మంత్రి రవి కుమార్, ఎమ్మెల్యేలు ఆనందరావు, ఉగ్రనరసింహ, పరిటాలశ్రీరామ్‌లను చేనేత ప్రముఖులు సంధారాఘవ, నాయకులు జింకా పురుషోత్తం, కొత్తపేట ఆది, సాయి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...పరిటాల రవితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటాపురం వెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు. పరిటాల శ్రీరామ్ నాయక త్వంలో ఇక్కడ పార్టీ ఎంత బలంగా ఉందో అర్థమవుతోందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఏవిధంగా అధ్వానంగా మారిందో అందరికీ తెలుసన్నారు. ఇలాంటి పరిస్థితి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఇచ్చిన మాట ప్రకారం అన్నిపథకాలు అమలు చేస్తున్న నాయకుడు సీఎం చంద్రబాబు అన్నారు. మనం చేసే మంచిని ప్రజలకు చెప్పే అవకాశం వచ్చిందని, నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సభను విజ యవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ.. మళ్లీమళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రావాలని ప్రజల అభిప్రాయ పడుతున్నారన్నారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ... ఎవరూ ఊహించని విధంగా 15 నెలల్లో సూపర్‌సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. కానీ వైసీపీ నాయకులు చెడుగా ప్రచారం చేస్తున్నారని, దానిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, సంధా రాఘవ, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు, పురుషోత్తం గౌడ్, చింతపులును పెద్దన్న, రాళ్లపల్లి షరీఫ్ వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, కరెంటు ఆది, గొట్లూరుశీన, చట్టా లక్ష్మీనారాయణ, అంబటి సనత్, బొట్టు కిష్ట, జింకల రాజన్న, సాయి, రాంపురం శీన, గంగారపు రవి, తలారి చంద్ర మోహన్, బీరే శీన తదితరులు పాల్గొన్నారు.


మంత్రి, ఎమ్మెల్యేలు, పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకులు

పండ్లతోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి: ఏపీఓ

తనకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్లతోట పెంపకం పథకాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఏపీఓ మరియమ్మ ఆదివారం తెలిపారు పండ్లతోటల పెంపకానికి ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పించిందన్నారు. పండ్ల మొక్కలు నాటే రైతులకు మూడేళ్లపాటు ఉపాధి హామీ పథకం నిధులు కేటాయి స్తున్నట్లు వివరించారు. అన్ని రకాల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించిం దన్నారు. పాడిపైన ఆధారపడిన రైతులు తప్పకుండా గడ్డిపెంకపం చేపట్టాలని సూచించారు. గడ్డి పెంపకానికి కూడా ఉపాధి హామీ పథకంలో అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పండ్లతోటలు, పూల తోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సహాకాలు అందిస్తోందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచిం చారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా మండలకేంద్రంలోని ఉపాధి హామీ పథకం అధికారులను సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై మంత్రికి వినతులు

ధర్మవరం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలపై టీడీపీ నాయకులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్మవరానికి ఆదివారం వచ్చిన మంత్రిని టీడీపీ పట్టణ అధ్య క్షుడు పరిశే సుధాకర్, టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, చీమల రామాంజి, క్లస్టర్ రామాంజి, అమర్, షరీఫ్ కలిసి విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ప్రియాంకనగర్‌లోని 52, 53, 54, 55, 59 నంబర్ల విద్యుత్ స్తంభాలకు వర్షాలు వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. అదేవిదంగా లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, కావున 100 కేవీ డీపీ మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. హమాలీ కాలనీలోనూ చిరంజీవి అనే స్థానికుడి ఇంటిపై విద్యుత్ లైన్ వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని వారు మంత్రిని కోరారు. శివరాంనగర్‌లో కేవీ 33 లైన్ తారక రామాపురం సబ్‌స్టేషన్ నుంచి ఇళ్లపై వెళ్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని టీడీపీ నాయకుడు రాంపురంశీన మంత్రికి విన్నవించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒకే పాఠశాలలో కలిసిమెలసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 45యేళ్ల తరువాత ఆదివారం మళ్లీ కలిశారు. మండలంలోని కొండకమర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 1979-80లో పది చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వారు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు శ్రీరాములు, పోతిరెడ్డిని దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు క్రిష్ణానాయక్, నరేంద్ర, మంగళూరు ఎస్పీ గంగిరెడ్డి, ఆర్డీఓ విశ్వేశ్వరనాయుడు, ఎస్ఐ రామచంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కంకర తేలిన రోడ్డు

● ప్రయాణం నరకప్రాయం

గాండ్లపెంట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కంకర తేలిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరక ప్రాయగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. మండలంలోని కటారుపల్లి నుంచి తుమ్మలబైలు వెళ్లే తారురోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆ దారి పొడవునా కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వివిధ పనుల నిమిత్తం తుమ్మలబైలు, పెద్ద తండా, సాదులవాండ్లపల్లి, గొడ్డివెలగల పంచాయతీల ప్రజలు గాండ్లపెంట, కదిరి ప్రాం తాలకు వెళ్తుంటారు. అలాగే ప్రసిద్ధి గాంచిన బోగాదమ్మ దేవతను దర్శించుకోవడానికి నిత్యం భక్తులు పలు వాహనాల్లో వస్తుంటారు. రహదారి కంకర తేలి, గుంతలు ఏర్పడ డంతో వాహనాలు అదుపు తప్పి, ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ప్రజలు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు కంకర తేలిన రోడ్డుకు మరమ్మతులు చేసి, ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలిన తుమ్మలబైలు రహదారి

ఈ కార్యాలయానికి దారెట్లా..!


గుంతలు తీయడంతో ట్రెజరీ కార్యాలయానికి దారిలేని దృశ్యం

కదిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రెజరీ కార్యాలయం ఎదుట రెవెన్యూ అధికారులు కాలువల్లాంటి రెండు గుంతలు తవ్వించారు. కార్యాలయ ఆవరణంలో ప్రవేశ ద్వారం నుంచి ట్రెజరీ కార్యాలయం వరకు ఒకటి, ఇటు ఆధార్ కేంద్రం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు రెండు వైపుల గుంతలు తవ్వించారు. దీంతో ట్రెజరీ కార్యాలయానికి వెళ్లేందుకు పించన్ దారులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. డ్రెజరీ కార్యాలయానికి ముఖ్యంగా పింఛన్‌దారులు వెళ్తుంటారు. వీరందరూ చాలా మటుకు వయస్సు పైబడిన వారే ఉంటారు. వీరందరూ కాలువ గుంతలు దాటుకుని వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు ఆ గుంతలన పూడ్చి ట్రెజరీ కార్యాలయానికి దారి కల్పించాలని వృద్ధులు కోరుతున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సేవారత్న అవార్డు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సేవా రత్న అవార్డును ఆదివారం అందుకున్నట్లు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కె. నరేంద్రప్రసాద్ తెలిపారు. కడపలోని శ్రీహరికళాశాలలో ప్రజాసేవా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు రంగసాయి రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అవార్డు అందుకున్న నరేంద్రను వైద్యులు భాను ప్రకాష్‌నాయక్, కమల్‌రోహిత్, సిబ్బంది అభినందించారు.

టీచర్స్ క్రికెట్ టోర్నీ విజేత ఎన్పీకుంట జట్టు


ట్రోఫీతో విజేత జట్టు

కదిరి అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఎన్పీ కుంట జట్టు ధర్మవరం జట్టుపై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 21రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 68 పరుగులకు ఆలౌట్ అయింది. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎన్పీకుంట జట్టు 11ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా సందీప్ ఎంపిక య్యారు. విజేత ఎన్పీకుంట జట్టుకు సీనియర్ క్రీడాకారులు ట్రోఫీ అందించి, అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, రమణ, సురేష్‌బాబు, క్రీడాకారులు సాయి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు, హరిప్రసాద్‌రెడ్డి, గౌస్‌లాజం, రుద్రమరెడ్డి, సురేంద్ర, శంకర్‌నారాయణ, ఆజాం, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి

● టీడీపీ సీనియర్ నాయకుడు

తనకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో సోమవారం టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు కొర్తికోట, మాజీ సర్పంచ్ ఎస్‌కే మస్తాన్‌వలి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశానికి ప్రతి కార్యకర్త ఉత్సాహంగా హాజరుకావాలన్నారు. పార్టీ కుటుంబ సభ్యులందరూ గ్రామాలాభివృద్ధికి కోసం సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి సహకరించాలని కోరారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

బత్తలపల్లి, సెప్టంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రనికి చెందిన అంజనప్ప, విశాఖపట్నానికి చెందిన సామవేదం సుబ్రహ్మణ్యం బళ్లారి రాఘవ అవార్డు అందుకున్నారు. వారిని స్థానిక పిరమిడ్ ధ్యానమండలి సభ్యులు ఆదివారం సన్మానించారు. కళకారులుగా గ్రామీణ ప్రాంతాలలోని కళాకారులను ప్రోత్సహిస్తూ కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్న అంజనప్ప, సుబ్రహ్మణ్యంను గుర్తించి అవార్డు ఇవ్వడం అనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ధ్యానమండలి సభ్యులు కొండన్న, మంజుస్వామి, అమర్, యోగా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఊరట

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏ పనిచేయాలన్న నిధులు లేవని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. గ్రామస్థులు, అధికారులు ఏ పనిచేయాలని చెప్పినా నిధులు లేవని చేతులెత్తేసేవారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే పంచాయతీ ఖాతాలకు జమ అవుతాయని జిల్లా పంచాయతీ అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో కనీసం పారిశుద్ధ్యం పనులు, వీధిలైట్లు, తాగునీటి కోసం నిధులు లేవని సర్పంచ్‌లు గగ్గోలు పెట్టేవారు. నిధులు విడుదల కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి దోహదం



ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం సంతోషాన్నిచ్చింది. ఈ నిధులతో గ్రామాల్లో ఉన్న పారిశుధ్య పనులు, తాగునీటి మరమ్మతులు, వీధిలైట్ల ఏర్పాటు తదితర పనులు చేపడుతాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడతలవారీగా నిధులు విడుదల చేయడం గ్రామాల భివృద్ధికి దోహదపడుతుంది.

● జాస్తి హరికృష్ణ, ముక్తాపురం సర్పంచ్, ముదిగుబ్బ మండలం

పంచాయతీలను అభివృద్ధి చేస్తాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే... గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువస్తామని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆ మేరకు నిధులు విడుదల చేయడం శుభపరిణామం. పలు అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి పంచాయతీలకు మంజూరైన నిధులను గతంలో వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. పంచాయతీల అభివృద్ధి కుంటుపడేలా చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే విడతల వారీగా నిధులు మంజూరు చేయడంతో గ్రామపంచాయతీలకు ఎంతోగాను ఉపయోగపడతాయి. దీంతో నిధులు లేవనే ఆలోచన లేకుండా పనులు చేసి గ్రామపంచాయతీలను అభివృద్ధి చేస్తాం.

● ముత్యాలప్ప నాయుడు, సర్పంచ్, ఉప్పునేసినపల్లి పంచాయతీ, ధర్మవరం మండలం

న్యూస్ బాక్స్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్/రొద్దం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నర్సింహారావు పంపిణీచేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో 52మంది లబ్ధిదారులకు రూ.26,53,615 అందించారు. వైద్య ఖర్చులు భరించలేని తమకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం చేయడంపై బాధితులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగ్రరాజు, నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ మంజునాథ్, మురళి, ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' సభను విజయవంతం చేయండి

మడకశిర టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న జరిగే సూపర్ సిక్స్. సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని నియోజకవర్గం జనసేన నాయకులు వెంకటేష్ గుప్తా కోరారు. ఆదివారం పట్టణంలో జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణతో పాటు కూటమి నేతలు హాజరు అవుతున్నారని తెలిపారు.

● అమరాపురం: సూపర్ సిక్స్. సూపర్ హిట్ కార్యక్రమానికి మండలం నుంచి కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు తరలి రావాలని పేర్కొన్నారు.

● రొళ్ల : మండల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సూపర్ సిక్స్. సూపర్ హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ జీకే ఈరన్న పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలన్నారు.

విద్యుత్ ప్రమాదంలో
వృద్ధుడికి తీవ్రగాయాలు

గోరంట్ల , సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిచెరువుపల్లికి చెందిన వృద్ధుడు లక్ష్మీనరసప్ప పశుగ్రాసం కోసం పొలాల్లోకెళ్లి ఆదివారం విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. గొర్రె పిల్లలకు పశుగ్రాసం తీసుకురావడానికి లక్ష్మీనరసప్ప ఉదయం 7.30 గంటలకు గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లారు. మొక్కజొన్న పంటకు అడవి జంతువుల నుంచి రక్షణ కోసం పొలం చుట్టు కంచెకు విద్యుత్ సరఫరా చేయడంతో, వాటికి తగిలి కుడికాలు, వీపు, తలకు విద్యుత్ షాక్ వల్ల తీవ్రగాయాలయ్యాయి. పొలాల్లోని రైతులు గుర్తించి వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ తేజశ్వని చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం, అక్కడి నుంచి బెంగుళూరుకు తరలించారు.

ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేస్తాం

అగళి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అవసరం ఉన్న ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేస్తామని తహసీల్దార్ సుబ్బారావు, ఏఓ నాగరాజ్, జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ పేర్కొన్నారు. అగళి, ఇరిగేపల్లిలోని రైతు సేవాకేంద్రాల్లో ఆదివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. రెండు రైతు సేవా కేంద్రాలకు 280 బస్తాల యూరియా వచ్చిందని, ప్రతి రైతుకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, పంట అవసరాలకు మాత్రమే యూరియా వాడాలని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీ వాడకం, వాటి ప్రాముఖ్యత, లాభాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

హిందూపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబి పండగలను పురస్కరించుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరించిన డీఎస్పీ మహేష్‌ను సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు సత్కరించారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో కలిసిన ఎస్‌డీపీఐ నాయకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నాయకులు నూర్‌మహ్మద్, షేక్ ఇమ్రాన్, అబ్దుల్ హబీబ్, మహ్మద్ ఉమర్, రియాజ్‌బాష, ఇమ్రాన్, వాహిద్, హబీబ్, అజహర్ పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ గురు జయంతి



నారాయణ గురు చిత్రపటానికి పూజలు

పావగడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈడిగ కులస్థుల ఆరాధ్య దైవం నారాయణ గురు జయంతిని పావగడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజగోపాల్, సీఐ రాజేష్, ఆర్య ఈడిగ సంఘం నాయకులు వీరాంజనేయ, మనుమేష్, పశువైద్యులు డాక్టర్ రామాంజనేయులు, రామప్ప, తదితరులు కలిసి నారాయణ గురు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహనీయుల ఆశయసాధనకు కృషి చేసినప్పుడే వారి జయంతికి పరిపూర్ణమైన అర్థం ఉంటుందని పలువురు తెలిపారు.

లైవ్‌స్టాక్ డైరెక్టర్‌కు సన్మానం

పరిగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శాసనకోటకు చెందిన యూజీ వెంకటేశ్ నియమితులైన సందర్భంగా తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి డైరెక్టర్ ఇంటికివెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంతోకాలంగా పార్టీ కోసం కష్టపడి పనిచేశారని, ఆయన రాష్ట్రస్థాయిలో పదవి దక్కడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో నాయకులు జూలారెడ్డి, సంజీవరాయప్ప, అశోక్, శివ, అక్కులప్ప పాల్గొన్నారు.



ఏపీ లైవ్‌స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రోడ్డుకు అడ్డంగా భవంతులు

● వినాయక విగ్రహాలు వెళ్లలేక అగచాట్లు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు



వినాయక విగ్రహ ఊరేగింపునకు అడ్డుగా ఉన్న భవనం, రోడ్డులోకి కట్టిన భవనాలు

రొద్దం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా భవంతులు నిర్మించినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో దారులు ఇరుకుగా మారాయి. దీంతో నిరంతరం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రొద్దంలో రోడ్డుకు అడ్డంగా భవనాలు కట్టడంతో శనివారం రాత్రి వినాయకుడి విగ్రహాలు వెళ్లలేక నానా అగచాట్లు పడ్డారు. రొద్దంలోని పోలేపల్లి వీధిలో ఓ వ్యక్తి రోడ్డుకు ఆనుకుని మేడ కట్టాడు. పది అడుగులు కూడా దారిలేక పోవడంతో 21 అడుగుల విగ్రహాన్ని తరలించడానికి ఇబ్బందులు పడ్డారు. దీంతో గంట పాటు ఇతర విగ్రహాలు నిలిచిపోయాయి. అతికష్టం మీద వినాయక విగ్రహాలను ముందుకు సాగేలా పోలీసులు, గ్రా మస్థులు చర్యలు తీసుకున్నారు. భవనానికి వినాయక విగ్రహం తగిలి ఎక్కడ విరిగిపోతుందోనని ఆందోళన చెందారు. రొద్దంలోని పోలేపల్లి, గాలిమిషన్ రోడ్డు, బ్యాంక్ సర్కిల్, చిన్నయ్య సర్కిల్ తదితర వీధుల్లో అనేక ఇళ్లు, రోడ్డు, డ్రైనేజీలు ఆక్రమించి భవనాలు నిర్మించారు. పంచాయతీ అధికారులు మామూళ్లు దండుకుని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ ట్రాక్టర్ ఎదురుగా వస్తే మరో ట్రాక్టర్ పక్కకు వెళ్లలేని పరిస్థితులు రొద్దంలోని పలు వీధుల్లో నెలకొంది. అక్రమ కట్టడాలపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓ ఆర్డీ గోవిందప్పను వివరణ కోరగా.. పంచాయతీ రోడ్లను ఆక్రమించుకుని అడ్డదిడ్డంగా భవనాలు నిర్మించినవారిపై సోమవారం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భక్తరహళ్లి ఆలయం మూసివేత



నరసింహస్వామి ఆలయాన్ని మూసివేసిన అర్చకులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని భక్తరహళ్లి నరసంహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేసినట్లు దేవదాయాశాఖ ఈఓ నరసింహరాజు, అర్చకులు ప్రభార్‌స్వామి చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటలకు స్వామికి సంప్రోక్షణ, అభిషేకాల అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బస్టాండులో నిలిచిన నీరు



మండలపల్లి బస్టాండులో నిలిచిన వర్షపు నీరు

గుడిబండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండలపల్లి బస్టాండులో వర్షపు నీరు నిలువ ఉండడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు నిలువ ఉండటంతో ఈగలు, దోమలు అధికమై రోగాల బారిన పడేఅవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే బస్టాండులో నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్‌ఎఫ్ అండ'



సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న వారితో నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గంలోని పదిమందికి రూ.18.63 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో భరోసాను ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ వెంకటేశ్, మండల కన్వీనర్లు రాము, అబి, శ్రీనివాసులు, నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, లక్ష్మీనారాయణయాదవ్, కొల్లకుంట శివశంకర్, విశ్వనాథ్‌రెడ్డి, భార్గవ్, పవన్, అంజినరెడ్డి, హరి పాల్గొన్నారు.

పండ్లతోటల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తనకల్లు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్లతోట పెంపకం పథకాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఏపీఓ మరియమ్మ ఆదివారం తెలిపారు పండ్లతోటల పెం పకానికి ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం అన్ని అవ కాశాలను కల్పించిందన్నారు. పండ్ల మొక్కలు నాటే రైతులకు మూడేళ్లపాటు ఉపాధి హామీ పథకం నిధులు కేటాయి స్తున్నట్లు వివరించారు. అన్ని రకాల పండ్ల మొక్కల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పాడిపైన ఆధారపడిన రైతులు తప్ప కుండా గడ్డిపెంకపం చేపట్టాలని సూచించారు. గడ్డి పెంపకానికి కూడా ఉపాధి హామీ పథకంలో అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పండ్లతోటలు, పూల తోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు ప్రోత్సహకాలు అందిస్తోందని ఆయన అ న్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచించారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

హంద్రీనీవా నీరు వచ్చేనా..?

● కార్యరూపం దాల్చని ఎత్తిపోతల పథకం పనులు
● సన్నగిల్లుతున్న మండల రైతుల ఆశలు




ఎండిపోయిన పోరెడ్డివారిపల్లి చెరువు

గాండ్లపెంట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలానికి హంద్రీనీవా కాలువ నీరు వచ్చేనా? అనే ప్రశ్న రైతుల్లో నెలకొంది. హంద్రీనీవా కాలువ నీరు జిల్లాలు దాటి కుప్పానికి వెళ్తోంది. అయితే గాండ్లపెంట మండలానికి రాకపోవడంతో మండల రైతుల్లో ఆశలు సన్న గిల్లుతున్నాయి. ఉమ్మడి జి ల్లాలోని అత్యంత మెట్ట ప్రాంతం ఉన్న, అత్యల్ప వర్షపాతం నమోదు అ య్యే గాండ్లపెంట మండలానికి కాలువల ద్వారా నీరు వస్తే రైతులు పంట లు సాగుచేసుకుని జీవనం సాగించవచ్చు. హంద్రీనీవా నీరు మండలానికి రప్పిస్తామంటూ ఎన్నికల ముందు నాయకులు హామీలు గుప్పించారేకానీ, కార్యరూపం దాల్చలేదు. మండల వ్యాప్తంగా వందకు పైగా చెరువు లు ఉ న్నాయి. భారీ వర్షాలు కురిస్తేనే అవి నిండుతాయి. అరకొర వర్షాలకు చుక్కనీర ఉండదు. మండలంలో ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆ ధారపడి జీవనం సాగిస్తున్నారు. బోర్లలో నీరు అడుగంటి పోవడంతో పం టలు సాగుచేయలేకపోతున్నారు. ప్రధానంగా ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ సాగుచేస్తారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పెట్టుబ డులు దక్కని పరిస్థితిలో దాదాపు రైతులందరూ ఖరీఫ్‌లో వేరుశనగను వదిలేసి, బోర్లకింద మాత్రమే పంటలు సాగుచేస్తున్నారు. అయితే బోర్లు ఎండిపోయి ఎంతోమంది నష్టాలు చవి చూశారు. అలాంటి మం డలంపై ఏ నాయకుడూ కరుణ చూపడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

ఇరువైపులా హంద్రీనీవా కాలువలు

మండలానికి ఇరువైపుల హంద్రీనీవా కాలువలు వెళ్తున్నాయి. ఒకవైపు తలుపుల మండలం మీదుగా, మరోవైపు నల్లచెరువు మీదుగా ఉన్నాయి. గాండ్లపెంట మండలం అత్యంత ఎత్తులో ఉండడంతో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు రావాలంటే ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలి. దీనిపై ఎమ్మెల్యే కందికుంట అసెంబ్లీలో చర్చించి, సంబంధిత ప్రణాళికలు ముందుకు సాగేందుకు చొరవ చూ పుతున్నారు. మండలానికి సమీపంలోని న ల్లచెరువు వద్ద హంద్రీనీవా కాలువ నీరు వెళ్తోంది. గాండ్లపెంటకు ఆ నీరు రావాలంటే సా మచేనుబైలు వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలి. దాని ద్వారా చెరువులకు నీరు అందించవచ్చు. అలాగే కదిరి రూరల్ మం డలానికి నీరు చేరే అవకాశముంది. హంద్రీనీవా ఎత్తిపోతుల పథకానికి రూ.60 కోట్లు ఖర్చు అవుతుందని, ఇరిగేషన్ అధికారులు ప్రణాళికలను త యారు చేసి, ఉన్నతాధికారులకు పంపారు. అయితే కార్యరూపం దాల్చ లేదు. మండలంలో చాలామంది రైతులు ఇప్పటికే ప్రధానంగా ఉద్యాన పంటలపై దృష్టి సారించి, పలు రకాల పండ్ల తోటలు విరివిగా సాగు చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మండలంలోని చెరువులు ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటి ఉద్యాన పంటల ఎండిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి మండలానికి హంద్రీనీవా నీరు తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

బోర్లు అడుగంటిపోతున్నాయి..



వర్షాలు సరిగా పడకపోవడంతో మండలంలోని చెరువులన్నీ ఎండిపోయాయి. బోర్లు అడుగంటాయి. మండల ప్రజలు వ్యవసాయంపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. నీరు లేకపోవడంతో రైతులు పంటలు సాగుచే యలేకపోతున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి పలుమార్లు బోర్లు వేసినా, ఒకట్రెండు పంటలకు మాత్రమే నీరు అందుతోంది. చెరువుల్లో నీరు లేక పోవడం వల్లే బోర్లు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ చూపి, హంద్రీనీవా నీటితో చెరువులు నింపాలి. అప్పుడు భూగర్భజలాలు పెరిగి ఉన్న బోర్లలోనే నీరు వస్తుంది. కొత్తగా బోర్లు వేసుకునే పరిస్థితి తప్పుతుంది. మండలం సస్యశ్యామలం అవుతుంది.

-రాఘవరెడ్డి, రైతు, కటారుపల్లి క్రాస్

నివేదికలు పంపాం

హంద్రీనీవా ఎత్తిపోతల పథకం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారి నుంచి అనుమతులు వస్తే, సామచేనుబైలు నుంచి ఎత్తిపో తల పథకం చేపడతాం. మండలంలోని చెరువులను నీటితో నింపేందుకు అవకాశముంటుంది. -అరుణకుమారి, జేఈ, ఇరిగేషన్

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, విరూపాక్షిస్వామిని వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆదివారం చంద్రగ్రహణం కారణంగా ఉదయం 10 గంటలకు ఆలయానికి తాళం వేసి సోమవారం ఉదయం ఆలయాన్ని శుద్ధిచేసి స్వామికి కైంకర్యాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్ గౌతం పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

● సోమందేపల్లి : మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారికి మాలపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జ్యోతి కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ప్రసాదాన్ని అందించారు.



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి, చౌడేశ్వరీదేవి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

గోరంట్ల, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సుమారు వందమంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొని ఒకనొకరు యోగక్షేమాలు తెలుసుకుని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యనేర్పిన గురువులు రఘురామిరెడ్డి, కుళ్లాయప్ప, నాగిరెడ్డి, సుబ్రహ్మణ్యం, జనార్దన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గోవిందురెడ్డి, రామచంద్రప్ప, బాలక్రిష్ణ, ప్రకాష్, శంకర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించి, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా గురువుల ఆశీర్వాదం పొందారు.

యూకేలో రొద్దం వాసి పీహెచ్‌డీ
-రైతు మిత్ర గ్రూపులపై పరిశోధన



రొద్దం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు ఉమాదేవి కుమార్తె స్వాతి యునైటెడ్ కింగ్‌డమ్‌లో వ్యవసాయంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. స్వాతి యూకేలోని షఫీల్డ్ యూనివర్సిటీ నందు రైతు మిత్ర గ్రూపుల ద్వారా ప్రభుత్వం అందించే మార్కెటింగ్, పంటలకు గిట్టుబాటుధరలు ఎలా అందుతున్నాయన్న వాటిపై పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు నెలలపాటు ఆమె సత్యసాయి జిల్లాలోని గాండ్లపెంట, తలుపుల, ఎన్‌పీ కుంట, నల్లమాడ, రొద్దం మండలాల రైతులతో వ్యవసాయం, ఉత్పత్తులు, గిట్టుబాటు ధరలు, పంటల రవాణా, రైతులు పండించే పంటలకు నష్టాలు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో తిరిగి రైతులతో ముఖాముఖి నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా సేంద్రీయ వ్యవసాయంతో ఆహార ఉత్పత్తులపై కలిగే ప్రయోజనాలు గురించి వివరాలు సేకరిస్తున్నారు. యూకేలో వైట్‌రోజ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా స్కాలర్‌షిప్‌లు పొందుతున్నారు. 2019-20లో యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్‌లో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నారు. రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి పవన్, తన అక్క స్వాతిని క్షేత్రస్థాయిలో పర్యటన కోసం తీసుకెళ్లి సహకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటస్వామి (ఫైల్)

పరిగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గణపతిపల్లికి చెందిన వెంకటస్వామి (45) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతిచెందాడు. ఏఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల మేరకు.. వెంకటస్వామి పైడేటిలో వ్యవసాయ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో పైడేటి- గణపతిపల్లి రహదారి మధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు హుటాహుటిన 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు అన్నదాత పోరుకు తరలిరండి

అమరాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న పెనుకొండలో నిర్వహించనున్న అన్నదాత పోరుకు రైతులు తరలిరావాలని మడకశిర నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, సమితి కార్యదర్శి వాగేష్ పిలుపునిచ్చారు. ఆదివారం అమరాపురం వైఎస్సార్ విగ్రహం ఆవరణంలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువులు బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు నిరసన కార్యక్రమాన్ని ఈనెల 9న పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సర్పంచులు గోవిందప్ప, నరసింహప్ప, ఎంపీటీసీలు నారాయణగౌడ్, ధనుంజయ, హనుమంతరాయ పాల్గొన్నారు.

నేడు రొద్దంకు మంత్రి రాక

రొద్దం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొద్దం టీడీపీ కార్యాలయంలో జరిగే సమావేశానికి రాష్ట్ర మంత్రి సవిత వస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నరహరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లిలో ఎంజేపీ పాఠశాలలో సమావేశానికి వస్తున్నట్లు వివరించారు. అనంతరం రొద్దం టీడీపీ కార్యాలయంలో సూపర్‌సిక్స్ సభ సక్సెస్ చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమావేశమతారన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు, పెనుకొండ ని యోజకవర్గ రాజకీయ పరిశీలకుడు నరసింహారావు వస్తారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గుప్త నిధుల కోసం తవ్విన దృశ్యం

గోరంట్ల , సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కసముద్రం గ్రామానికి వెళ్లే రహదారిలో పోలేరమ్మ గుడి వద్దగుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం శనివారం రాత్రి తవ్వకాలు జరిపినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలేరమ్మ ఆలయం సమీపంలోవారు క్షుద్రపూజలు చేసి, గుప్త నిధులకోసం ఆలయ సమీపంలోని రాళ్లను తొలగించినట్లు స్థానికులు తెలిపారు.

టీచర్ల క్రికెట్ టోర్నీ విజేత ఎన్పీకుంట జట్టు



ట్రోఫీతో విజేత జట్టు

కదిరి అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌టీ ఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఎన్పీ కుంట జట్టు ధర్మవరం జట్టుపై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉపాధ్యాయ దినో త్సవాన్ని పురస్కరించుకుని 21రోజుల పాటు జరిగిన ఈ టోర్న మెంట్ ఆదివారం ముగిసింది. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 68 పరుగులకు ఆలౌట్ అయింది. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎన్పీకుంట జట్టు 11ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా సందీప్ ఎంపిక య్యారు. విజేత ఎన్పీకుంట జట్టుకు సీనియర్ క్రీడాకారులు ట్రోఫీ అందించి, అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నా యక్, రమణ, సురేష్‌బాబు, క్రీడాకారులు సాయి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు, హరిప్రసాద్‌రెడ్డి, గౌస్‌లాజం, రుద్రమరెడ్డి, సురేంద్ర, శంకర్‌నారాయణ, ఆజాం, రామమోహన్ పాల్గొన్నారు.

పంచాయతీలకు ఊరట

ధర్మవరంరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏ పని చేయాలన్న నిధులు లేవని సర్పంచ్‌లు గగ్గోలు పెడుతున్నారు. గ్రామస్థులు, అధికారులు ఏ పనిచేయాలని చెప్పినా నిధులు లేవ ని చేతులెత్తేసేవారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచా యతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే పంచాయతీ ఖాతాలకు జమ అవుతాయని జిల్లా పంచాయతీ అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో కనీసం పారిశుద్ధ్యం పనులు, వీధిలైట్లు, తాగునీటి కోసం నిధులు లేవని సర్పంచ్‌లు గగ్గోలు పెట్టేవారు. నిధులు విడుదల కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.